క్లుప్తంగా

డివైడర్‌పైకి దూసుకెళ్లిన లారీ


డివైడర్‌పైకి దూసుకెళ్లిన లారీ

బేస్తవారిపేట: పట్టణంలోని పాత స్టేట్‌బ్యాంక్ సమీపంలో సర్వీస్ రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన డివైడర్‌పైకి లారీ దూసుకెళ్లిన సంఘటన గురువారం తెల్లవారు జామున జరిగింది. ప్రొద్దుటూరు నుంచి భువనేశ్వర్‌కు పచ్చిమిర్చి లోడుతో వెళ్తున్న లారీని డ్రైవర్ నిద్రమత్తులో రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన డివైడర్‌పైకి ఎక్కించాడు. డివైడర్‌పై ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్‌ను పది మీటర్ల వరకు ఛిద్రం చేసుకుంటూ ముందుకు వెళ్లింది. ఎడమ వైపు వెళ్లాల్సిన లారీ కుడి వైపున డివైడర్‌పైకి ఎక్కింది. ఆ సమయంలో అదృష్టవశాత్తు ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. లారీ ముందు బాగం నుజ్జునుజ్జయింది.

14న జాతీయ లోక్ అదాలత్

గిద్దలూరు రూరల్: వచ్చే నెల 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ.ఓంకార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో కక్షిదారులు తమ తమ కేసులను సత్వరమే పరిష్కరించుకోవచ్చన్నారు. రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పట్టణంలోని కోర్టు భవనం ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్‌ను ప్రతి ఒక్క కక్షిదారుడు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గిద్దలూరు కమిషనర్‌గా వెంకట్‌దాసు

గిద్దలూరు రూరల్: గిద్దలూరు నగర పంచాయతీ కమిషనర్‌గా వెంకట్‌దాసును ప్రభుత్వం బదిలీ చేసింది. ప్రస్తుతం మాచర్ల కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకట్‌దాసును గిద్దలూరు నగర పంచాయతీ కమిషనర్‌గా బదిలీ చేయడంతో ఆయన త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

దివ్యాంగులు దైవంతో సమానం

కంభం: దివ్యాంగ చిన్నారులు దైవంతో సమానమని, వారి పట్ల ఆప్యాయత, అనురాగాలను కలిగి ఉండాలని మండల విద్యాశాఖాధికారి కె.శర్వాణి అన్నారు. స్థానిక బోర్డు స్కూల్లో ఉన్న నాన్ భవిత కేంద్రాన్ని గురువారం ఆమె సందర్శించారు. కేంద్రంలో దివ్యాంగ చిన్నారి సయ్యద చోటా మస్తాన్ పుట్టిన రోజును పురస్కరించి కేక్ కట్ చేయించారు. విద్యార్థి తల్లి షేక్ ఫర్జానా కేంద్రానికి కుర్చీలు బహూకరించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు పరిశీలించి పిల్లలకు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు ఈశ్వరి, అరుణ్, సీఆర్పీలు మురళి, రవీంద్ర, రామచంద్రుడు పాల్గొన్నారు.

కొమరోలు ఎంపీడీఓగా నరసయ్య

కొమరోలు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నూతన ఎంపీడీఓగా డి.నరసయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎంపీడీఓ నరసింహారావు గత శనివారం బదిలీపై గుంటూరు జిల్లాకు వెళ్లారు. ఆయన స్థానంలో నరసయ్యను ఉన్నతాధికారులు నియమించగా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీఓ నరసయ్య గతంలో కొమరోలు మండల ఎంపీడీఓగా విధులు నిర్వహించారు.



చిల్లులు పడి ఉన్న స్లైడర్స్


పనిచేయని హిప్ ట్విస్టర్

ఈ పార్క్.. నిర్లక్ష్యానికి మార్క్!


వాకింగ్ ట్రాక్ ఇలా..


తాళ్లతో కట్టి ఉంచిన ఓపెన్ జిమ్ పరికరాలు


శిథిలావస్థలో ఆట వస్తువులు

- శిథిలావస్థలో ఆటవస్తువులు
- ఓపెన్ జిమ్‌లో పనిచేయని పరికరాలు

మార్కాపురం టౌన్: పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో ఉన్న మాగుంట సుబ్బరామి రెడ్డి చిల్డ్రన్స్ పార్కులో నిర్లక్ష్యానికి నీడలా మారింది. పచ్చదనంతో ఆహ్లాదాన్ని పెంచారు. అలాగే చిన్నపిల్లలకు ఆట వస్తువులు.. పెద్దలకు ఓపెన్ జిమ్‌ను నాలుగేళ్ల క్రితం రూ. 90 లక్షల మున్సిపల్ నిధులతో ఏర్పాటు చేశారు. అయితే మూడేళ్లకే ఆటవస్తువులు శిథిలావస్థకు చేరడంతో పార్కుకు వెళ్లే పిల్లలు, పెద్దలు నిరాశతో వెనుదిరుగుతున్నారు. వాకింగ్ ట్రాక్‌లో మాత్రమే వినియోగంలో ఉంది. చిన్నపిల్లలకు ఊయలలు, జారుడు బండ (స్లైడర్) తదితర వస్తువులు నిరుపయోగంగా ఉన్నాయి. జిమ్‌లో ఉన్న వస్తువులు దాదాపు 80 శాతం మరమ్మతులకు గురికావడంతో వాటిని తాళ్లతో కట్టి ఉంచారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ స్థలాలను గుర్తించి రీక్రియేషన్ సెంటర్లను ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుందని ప్రజలు కోరుతున్నారు. పట్టణ ప్రజల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతున్నా వారు సేద తీరే ఏర్పాట్లు చేయకపోవడం శోచనీయం.

బాధ్యతలు స్వీకరించిన పోలీసు అధికారులు


పొదిలి సీఐ వెంకటేశ్వర్లు


మార్కాపురం పట్టణ ఎస్‌ఐ సైదుబాబు


మార్కాపురం రూరల్ ఎస్సై అంకమరావు

పొదిలి: పొదిలి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నియమితులైన టి.వెంకటేశ్వర్లు గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. తెనాలిలో పని చేస్తూ ఇక్కడికి వచ్చారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పొదిలిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం దృష్టి సారిస్తామని తెలిపారు.

మార్కాపురం టౌన్: మండల కేంద్రం మార్కాపురం పట్టణ ఎస్‌ఐగా సైదుబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పామూరులో పనిచేస్తూ బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన ఎస్సై అబ్దుల్ రెహమాన్ ఒంగోలు వీఆర్‌కు వెళ్లారు. అలాగే మార్కాపురం రూరల్ ఎస్‌ఐగా పి. అంకమరావు గురువారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఈయన దోర్నాలలో పనిచేస్తూ బదలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న వెంకటేశ్వర నాయక్ వీఆర్‌కు వెళ్లారు.

పైపులైన్‌కు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..


మరమ్మతులు చేస్తున్న కార్మికులు

బేస్తవారిపేట: స్థానిక రెడ్డి నగర్‌లో పది రోజుల క్రితం పగిలిన పైపులైన్‌కు పంచాయతీ అధికారులు మరమ్మతులు గురువారం చేపట్టారు. పైపులైన్ పగలడంతో రోడ్డు మొత్తం మురికి కూపంగా మారడం, రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై 'సాక్షి'లో ఈ నెల 21వ తేదీన పగిలిన మంచినీటి పైపులైన్ అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి పంచాయతీ కార్యదర్శి నరేంద్ర స్పందించారు. పగిలిన పైపులైన్‌కు మరమ్మతులు చేయడంపై రెడ్డినగర్‌వాసులు, వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పద్మావతి అమ్మవారికి సారె


కోలాటం ప్రదర్శిస్తున్న మహిళా భక్తులు

మార్కాపురం: శ్రావణ మాసం సందర్భంగా పట్టణ సమీపంలోని గుండ్లకమ్మ నది ఒడ్డున వెలసిన శ్రీ లక్ష్మి పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పలువురు మహిళా భక్తులు పద్మావతి అమ్మవారికి సారె సమర్పించారు. సుమారు 150 మంది మహిళా భక్తులు ఆలయానికి వచ్చి భక్తి చీర, గాజులు, పూలు, పండ్లు సమర్పించారు. అధ్యక్షుడు చక్కా మాలకొండ నరసింహారావు, కార్యదర్శి ఊటుకూరి రామకృష్ణ, కోశాధికారి పాదర్తి శ్రీనివాసులు తదితరులు తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం కోలాట ప్రదర్శన జరిగింది.

తర్లుపాడులో నేడు గ్రామ సభలు

తర్లుపాడు: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామ పంచాయతీల్లో చేపట్టాల్సిన పనుల గురించి శుక్రవారం గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరసింహులు తెలిపారు. ఇందుకు గాను ప్రతి గ్రామానికి నోడల్ అధికారిని కేటాయించారు. చెన్నారెడ్డిపల్లికి ఎంఈఓ డి. సుజాత, గానుగపెంటకు ఏఓ టి. వెంకటేశ్వర్లు, గొల్లపల్లికి ఎంఈఓ 2 సుబ్బారావు, జగన్నాథపురానికి అసిస్టెంటు స్టాటికల్ ఆఫీసర్ జి. కార్తీక, కలుజువ్వలపాడుకు పీఆర్ ఏఈ డి. శ్రీనివాసరెడ్డి, కేతగుడిపికి హౌసింగ్ ఏఈ నిర్మల్ బాబు, మంగళకుంటకు మండల సర్వేయర్ ఎస్. సుబ్బారెడ్డి, మీర్జపేటకు వీఏఎస్ ఎం. నందన, నాగెళ్లముడుకపు ఏపీఎం పిచ్చయ్య, పోతలపాడుకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఈసీ పెద్దన్న, రాగసముద్రంకు ఏఓ బి. చంద్రశేఖర్, సీతానాగులవరంకు ఈఓఆర్‌డీ ఎం. బాలకృష్ణ, సూరేపల్లికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణవేణి, తాడివారిపల్లికి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగరాజు, తర్లుపాడుకు డిప్యూటీ తహసీల్దార్ ఇబ్రహీం ఖలీల్, తుమ్మలచెరువుకు ఏపీఓ చిన్నకొండయ్యలు నోడల్ అధికారులుగా వ్యవహరించనున్నారు.

పొదిలి రూరల్: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో 2024–2025 ఏడాదికి గాను ఎంజీఎన్‌ఆర్ ఈజీఎస్‌కి సంబంధించి ప్రతిపాదిత పనుల ఆమోదం, అత్యవసర పనులపై చర్చించనున్నారు. ఈమేరకు గురువారం గ్రామ సభలు నిర్వహించుచున్నట్లు మండల ప్రత్యేక అధికారి బి. ఉదయ్ కుమార్ తెలిపారు. మండల స్థాయి నోడల్ అధికారులను నియమించినట్లు చెప్పారు. ఉదయం పాములపాడు, ఏలూరు, జువ్వలేరు, మూగచింతల, అక్కచెరువు, కొండాయపాలెం, మల్లవరం, ఆముదాలపల్లి, ఉప్పలపాడు, సూదనగుంట, కుంచేపల్లి, సాయంత్రం ఓబులక్కపల్లి, అన్నవరం, తుమ్మగుంట, తలమళ్ళ, ఈగలపాడు పంచాయతీల్లో జరుగుతాయన్నారు.

కొమరోలు: మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీలో శుక్రవారం ఉపాధి హామీ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఏపీఓ మహాలక్ష్మి తెలిపారు. మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నామని, మండలంలోని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆమె కోరారు.

ఉపాధి హామీ పనులపై గ్రామసభలు

బేస్తవారిపేట: మండలంలోని 19 పంచాయతీల్లో శుక్రవారం 2024–25 సంవత్సరానికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ప్రతిపాదిత పనుల ఆమోదం, గ్రామానికి కావాల్సిన పనులు ఎంపికపై గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పార్వతి తెలిపారు. నోడల్ అధికారుల ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు గ్రామ సభలు జరుగుతాయన్నారు. పందిళ్లపల్లె, జేసీ అగ్రహారం పంచాయతీల్లో మధ్యాహ్నం 2 గంటలకు, పెద్ద ఓబినేనిపల్లె పంచాయతీలో ఉదయం 12 గంటలకు సభ జరుగుతుందని తెలిపారు.


స్టేషన్ ముందు పూలకుండీల ఏర్పాటు


స్టేషన్ ఆవరణలో చెట్ల కింద ఏర్పాటు చేసిన బల్లలు

ఆహ్లాదం.. చల్లదనం

- ఆహ్లాదకరంగా కొనకనమిట్ల పోలీస్ స్టేషన్
- ఎస్‌ఐ మాధవరావు కృషితో సొబగులు
- అర్జీదారులు చెట్ల కింద సేదతీరే అవకాశం


రిసెప్షన్ రూమ్

కొనకనమిట్ల: పలు సమస్యల పరిష్కారం కోసం పోలీస్ స్టేషన్ గడప తొక్కే ప్రజలకు కొనకనమిట్ల పోలీస్ స్టేషన్ ఆహ్లాదకర వాతావరణంలో స్వాగతం పలుకుతుంది. గత ప్రభుత్వ హయాంలో జిల్లా అధికారుల ఆదేశాలతో పోలీస్ స్టేషన్‌లో అన్ని వసతులు కల్పించేందుకు స్టేషన్ ఎస్‌ఐ కె.మాధవరావు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అందంగా తీర్చిదిద్దారు. అర్జీదారులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా పోలీస్ స్టేషన్ ఆవరణలో వెయిటింగ్ రూమ్, రిసెప్షన్ రూమ్‌లు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. పలువురు దాతల సహకారంతో చెట్ల కింద కూర్చోవడానికి సిమెంట్ బల్లలు ఏర్పాటు చేశారు. పలు రకాల పూల కుండీలను ఏర్పాటు చేశారు. దీంతో స్టేషన్ ఆవరణ అందంగా కనిపిస్తోంది. ఎస్‌ఐ మాధవరావు కృషిని పలువురు అభినందిస్తున్నారు.

సంస్థ సేవలు విస్తృతం చేయాలి


కేక్ కట్ చేస్తున్న సంస్థ సభ్యులు

పొదిలి: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆవిర్భావ దినోత్సవం గురువారం వాసవి షాపింగ్ కాంప్లెక్స్‌లోని సంస్థ కార్యాలయం ఆవరణలో జరిగాయి. సంస్థ సేవలు విస్తృతం చేయాలని తీర్మానించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. డైరెక్టర్లు కాటూరి వెంకట నారాయణబాబు, తానికొండ వెంకటరావు, కన్వీనర్ కల్లం సుబ్బారెడ్డి, అధ్యక్షుడు సామంతపూడి నాగేశ్వరరావు, కార్యదర్శి అశోక్ బండి, పేర్ల శ్రీనివాసరావు, డాక్టర్ మణి, యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, జి.శ్రీనివాసులు, షేక్.రసూల్, యాసిన్, మోహనరావు, వెంకటరావు, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

చెత్తాచెదారం తొలగింపు


తొలగించిన చెత్త, ఇతర వ్యర్థాలు

సాక్షి ఎఫెక్ట్..

రాచర్ల: మండల కేంద్రం రాచర్ల నుంచి అనుమల వీడు గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలో చెత్త చెదారంతో పాటు వ్యర్థాలను రోడ్డు పక్కనే పడేయ్యడంతో ఆ వ్యర్థాలపై పందులు, కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని.. వ్యర్థాల కోసం వచ్చే పందులు, కుక్కలు అటు ఇటు తిరగడంతో చిన్న చిన్న ప్రమాదాలు జరుగుతున్నాయని బుధవారం సాక్షి దినపత్రికలో వచ్చిన.. చెత్త నుంచి సంపద ఇదేనా?..అనే కథనానికి అధికారులు స్పందించారు. రోడ్డు పక్కనే ఉన్న చెత్తతో పాటు వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారు. రాచర్ల నుంచి అనుమల వీడు, సోమిదేవిపల్లె, గంగంపల్లె, పాలకవీడు గ్రామాలకు వెళ్లే వాహనదారులు చెత్త, వ్యర్థాలు తొలగించి శుభ్రం చేసిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

పడకేసిన పోస్టల్ సేవలు


గిద్దలూరు పోస్టాఫీసు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని పోస్టాఫీసు కార్యాలయంలోని సేవలు పడకేశాయనే చెప్పవచ్చు. గురువారం పోస్టాఫీసులో నగదు చెల్లించేందుకు వచ్చిన ఖాతాదారులు సేవలు అందుబాటులో లేకపోవడంతో వెనుదిరిగారు. ఆన్‌లైన్ సర్వీసులు పనిచేయక పోవడంతో అక్కడి సిబ్బంది కుర్చీలకే పరిమితమయ్యారు. కొన్ని సంవత్సరాలుగా విద్యుత్ కోత సమయంలో జనరేటర్ పనిచేయక పోవడంతో కరెంట్ వచ్చే వరకు సేవలు నిలిచిపోతున్నాయి. ఇన్వర్టర్, యూపీఎస్ వంటి ఇతర సౌకర్యాలు లేవు. ఖాతాదారులు పెద్ద నగదును తీసుకునేందుకు పోస్టాఫీసుకు వెళ్లిన సమయంలో తమ కార్యాలయంలో నగదు అందుబాటులో లేదని మార్కాపురం నుంచి తెప్పించి ఇస్తామంటూ సిబ్బంది సమాధానం చెబుతూ పంపుతున్నారు. గతంలో స్టేట్ బ్యాంకు నుంచి నగదు తెచ్చి ఇచ్చేవారు. దీంతో ఖాతాదారులు ఇబ్బందులు లేకుండా ఉండేవారు. ప్రస్తుతం ఖాతాదారులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. పట్టణంలో నడిబొడ్డులో ఉన్న పెద్ద పోస్టాఫీసులో ఆన్‌లైన్ సర్వీసులు పనిచేయకపోవడం ఏమిటంటూ ఖాతాదారులు వాపోతున్నారు. కార్యాలయంలో పోస్టుమాస్టర్ కాక మరో ఏడుగురు ఉండాల్సి ఉండగా కేవలం ఇద్దరు మాత్రమే పనిచేస్తున్నారు.

స్ప్రింగ్ బోర్డు స్కూల్‌పై అవాస్తవాలు ప్రచారం


స్కూల్లోని విద్యార్థులను ప్రశ్నిస్తున్న డిప్యూటీ డీఈఓ

గిద్దలూరు రూరల్: పట్టణంలోని స్ప్రింగ్ బోర్డు స్కూల్‌పై కొందరు గిట్టని వ్యక్తులు అవాస్తవాలను సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని డిప్యూటీ డీఈఓ చంద్రమౌళి అన్నారు. సోషల్ మీడియాలో స్ప్రింగ్‌బోర్డు స్కూల్ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని అందుకు విద్యాశాఖ అధికారులు సహకరిస్తున్నారంటూ సోషల్ మీడియాలో వచ్చినందుకు ఆయన గురువారం స్కూల్‌ను పరిశీలించారు. స్కూల్ రికార్డులను ఉపాధ్యాయులు, విద్యార్థుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని, అటువంటి వాటిని ప్రజలు నమ్మవద్దన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే స్కూల్ నిర్వహిస్తున్నారని, అందుకు సంబంధించిన పూర్తి అనుమతులు ఉన్నాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట ఎంఈఓ కె.వెంకటేశ్వరరావు, స్కూల్ కరస్పాండెంట్ మణిచైతన్య, సిబ్బంది ఉన్నారు.